అధ్వాన దారులతో అవస్థలు

అర్ధంతరంగా నిలిచిన గ్రామీణ రోడ్ల పనులు

- అరకొరగా చేసి చేతులు దులుపుకొన్న వైనం
- వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీలో గుంతలమయంగా మారిన రోడ్డు



మొయినాబాద్‌రూరల్: శ్రీనిధి సమీపంలో అధ్వానంగా ఉన్న రోడ్డు

మొయినాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల రోడ్లకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయి. అప్పటి మంత్రులు పనులు ప్రారంభించి చేతులు దులుపుకున్నారు. గుత్తేదారు అరకొరగా పనులు పూర్తిచేసి వదిలేయంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. అడుగడుగునా రోడ్లపై గుంతలు పడడంతో నరకయాతన పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇది అజీజ్‌నగర్ చౌరస్తా నుంచి పలు గ్రామాలకు వెళ్లే రోడ్డు దుస్థితి. ఈ రోడ్డు పనులను 1.30కోట్లు సీసీఆర్ నిధులతో ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వాహనాదారులు, ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

అసంపూర్తిగా రోడ్డు పనులు

మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి నాగిరెడ్డిగూడ రోడ్డు పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రారంభించి మధ్యలోనే నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ నాగిరెడ్డిగూడ గ్రామం వరకు సీఆర్‌ఆర్(కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్) నిధులు 1.30 కోట్లతో గత ప్రభుత్వంలో 2023 ఏప్రిల్ 16న అప్పటి మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు రోడ్డు పనులను ప్రారంభించారు. ఆ పనులను అప్పట్లో అధికారులు అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి శ్రీనిధి పాఠశాల సమీపం వరకు, అదేవిధంగా అజీజ్‌నగర్ దాటిన తర్వాత నాగిరెడ్డిగూడ వరకు రోడ్డువేశారు. కానీ శ్రీనిధి పాఠశాల సమీపంలో కొంత దూరం, అజీజ్‌నగర్ ఎస్సీ కాలనీ మొత్తం రోడ్డు వేయలేదు. ఎస్సీ కాలనీ నుంచి అజీజ్‌నగర్ గ్రామం వరకు రోడ్డు వేయడం మరిచిపోయారు. దీంతో ఈ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు ఆయా గ్రామాల ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డుపై అజీజ్‌నగర్ నుంచి మొదలుకొని నాగిరెడ్డిగూడ, బాకారం, కాశీంబౌలి, అమ్డాపూర్, శంషాబాద్, షాబాద్ మండలాలకు కలుపుతూ వెళ్లే ప్రయాణికులు, ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వదిలిపెట్టిన రోడ్డుపై అడుగడుగునా గుంతలు పడడంతో రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. శ్రీనిధి పాఠశాల ఎదుట రోడ్డుపై అనేక గుంతలుపడడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఎస్సీ కాలనీలో రోడ్డు అధ్వానంగా మారడంతో ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. ఈ రోడ్లపై వెళ్లాలంటే నరకయాతన అనుభవిస్తున్నామని అజీజ్‌నగర్ గ్రామస్తులతో పాటు ఇతర గ్రామాలకు వెళ్లే వారు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను పూర్తిచేయించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అడుగడుగునా గుంతలే



మండల పరిధిలోని అజీజ్‌నగర్ రోడ్డు అడుగడుగునా గుంతలుపడి నరకయాతన అనుభవిస్తున్నాం. సంవత్సరం దాటినా అతుకుల రోడ్డే గతి. రోడ్డు వేయని చోట అడుగడుగునా గుంతలు పడడంతో ప్రమాదాలకు గురవుతున్నాం. వాహనాన్ని నడపాలంటే భయంగా ఉంది. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఇప్పటికైనా ఈ రోడ్డు పనులు పూర్తిచేయాలి.

–తమ్మలి అద్వానీ, అజీజ్‌నగర్

ప్రమాదాలకు నిలయంగా మారింది



అర్ధంతరంగా నిలిచిన రోడ్డుపై రాత్రి వేళ ప్రమాదాలు జరుగుతున్నాయి. మండల పరిధిలోని అప్పా పాత రోడ్డు అయిన అజీజ్‌నగర్ చౌరస్తా నుంచి అజీజ్‌నగర్ గ్రామం వరకు శ్రీనిధి, అజీజ్‌నగర్, ఎస్సీకాలనీ మధ్యలో రోడ్డు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి. ఈ రోడ్డుపై ఏర్పడిన గుంతలు ప్రమాదాలకు దారితీస్తున్నాయి. అధికారులు స్పందించి రోడ్డు పనులను పూర్తిచేయించాలి.

–కొత్త మాణిక్‌రెడ్డి, అజీజ్‌నగర్

నిధులు రాగానే ప్రారంభిస్తామన్నారు



మండల పరిధిలోని అజీజ్‌నగర్ పాత చౌరస్తా నుంచి నాగిరెడ్డిగూడ వరకు రోడ్డు మంజూరైన విషయం నిజమే. దీంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రులు, ప్రజాప్రతినిధులు రోడ్డు పనులను ప్రారంభించారు. కాంట్రాక్టర్ అజీజ్‌నగర్ చౌరస్తా నుంచి శ్రీనిధి సమీపం వరకు, అదేవిధంగా అజీజ్‌నగర్ నుంచి నాగిరెడ్డిగూడ వరకు బీటీరోడ్డు పూర్తిచేశారు. కానీ శ్రీనిధి పాఠశాల సమీపం నుంచి ఎస్సీకాలనీ, అజీజ్‌నగర్ గ్రామం వరకు రోడ్డు వేయలేదు. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డును సీసీరోడ్డు వేయాలని స్థానికులు కోరడంతో నిధులు రాగానే పనులు చేపడతామని కాంట్రాక్టర్ తెలిపినట్లు పేర్కొన్నారు.

–విజయ్‌కుమార్, డిప్యూటీ డీఈ పంచాయతీరాజ్, మొయినాబాద్

క్లుప్తంగా

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి



మధుసూదన్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాబాద్: గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్‌గా నియమితులైన ఎలుగంటి మధుసూదన్‌రెడ్డిని మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిసి సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని గ్రంథాలయాలను అభివృద్ధి పరిచేందుకు కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేశ్, సూర్య, సోనీ, అచ్చిని అంజయ్య, కావలి శేఖర్, రాజేందర్, లక్ష్మణ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు దుస్తుల పంపిణీ

చేవెళ్ల: కార్మికులను గుర్తించి వారికి సరైన ప్రోత్సాహకం అందించాలని మాజీ వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్ అన్నారు. మండలంలోని ఊరేళ్ల గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ కార్మికులకు, సిబ్బందికి దసరా పండుగ సందర్భంగా దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం గ్రామం శుభ్రత కోసం పనిచేసే కార్మికులను ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. చాలిచాలనీ జీతాలతో వారు కాలం వెల్లదీస్తున్నారని, అలాంటి వారికి పండుగల సమయంలో తమవంతుగా ప్రోత్సాహకం అందించాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జహంగీర్, మాజీ ఉపసర్పంచ్ విఠలయ్య, గ్రామస్తులు ఉన్నారు.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత



విద్యార్థికి ల్యాప్‌టాప్ అందిస్తున్న దాత మంగలి యాదగిరి

చేవెళ్ల: చదువుకు పేదరికం, ప్రభుత్వ పాఠశాలలు ఏమి అడ్డురావని ఎంబీబీఎస్‌లో ఉచిత సీటు సాధించిన పేద విద్యార్థి ఇందు నిరూపించిందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మంగళి యాదగిరి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం రచ్చబండ వినాయక మండపం వద్ద చేవెళ్లకు చెందిన మంగలి యాదగిరి ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు సాధించిన కార్మికుడు సాయన్న కూతురు ఇందుకు ల్యాప్‌టాప్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థిని హిందు, ఆమె తల్లిదండ్రులను సన్మానించి అభినందనలు తెలిపారు. ఇందును ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు అనంత్ రెడ్డి, సత్యనారాయణ, మానిక్యం, సత్తి, వేణు, ప్రశాంత్, ప్రవీణ్, యువకులు ఉన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఆంజనేయులు

మొయినాబాద్‌రూరల్: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ నూతన అధ్యక్షుడిగా మండలంలోని హిమాయత్‌నగర్ జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అల్లూరి ఆంజనేయులు మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శామీర్‌పేట్‌లో నిర్వహించిన పీఆర్టీయూ టీఎస్ రాష్ట్ర 35వ కౌన్సిల్ సమావేశంలో పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి, మండల బాధ్యులు బందయ్య, నరేందర్‌రెడ్డి, రాములు, వినోద్ తదితరులకు అంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు.

డంపింగ్‌యార్డును తరలించాలని వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

షాద్‌నగర్: షాద్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న డంపింగ్‌యార్డును వెంటనే తరలించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్తులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్తను డంప్‌తో విపరీతమైన దుర్వాసన వస్తోందని, ఈగలు, దోమలు వృద్ధి చెంది ఇళ్లలోకి వస్తున్నాయని పేర్కొన్నారు. అదేవిధంగా రోగాల బారినపడి ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నామన్నారు. డంపింగ్‌యార్డును తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సింగపాగ జగయ్య, వెంకటేశ్‌గౌడ్, ఆంజనేయులు, నర్సింలు, సోమ్లానాయక్, ఆనంద్, రమేశ్, మోహన్, హరీశ్, శ్రీహరి, శివ, రాము ఉన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



అజీజ్‌నగర్ క్రికెట్ జట్టుతో బండ్లగూడ శ్రీధర్

మొయినాబాద్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని స్వచ్ఛంద సేవా నాయకుడు బండ్లగూడ శ్రీధర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్ గ్రామంలో రవికాంత్‌రెడ్డి, శ్రీనారెడ్డిలు ఆర్గనైజింగ్ ఆధ్వర్యంలో చేవెళ్ల నియోజకవర్గంలోని మొయినాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట్, చేవెళ్ల, షాబాద్ మండలాల్లోని క్రికెట్ జట్టులతో నియోజకవర్గస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మంగళవారం అజీజ్‌నగర్ గ్రామ పంచాయతీ మాజీ వార్డు సభ్యురాలు బండ్లగూడ సుధాశ్రీధర్ ఆధ్వర్యంలో అజీజ్‌నగర్ క్రికెట్ టీమ్‌కు వారు కావాల్సిన క్రికెట్ కిట్‌తో పాటు డ్రెస్‌ను పంపిణీ చేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ 45రోజుల పాటు నిర్వహిస్తారని, నియోజకవర్గంలోని 22 జట్టులు పాల్గొంటాయని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ యువకులు, వివిధ గ్రామాల క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



ధర్నా చేస్తున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్, కార్మికులు

షాబాద్: అంతారం డబ్ల్యూటీపీ ప్లాంట్ మిషన్ భగీరథ కార్మికుల రెండునెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం మిషన్ భగీరథ 40 ఎమ్‌ఎల్‌డీ నీటిశుద్ధి కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రంలో కేఎస్‌ఆర్ కాంట్రాక్టు కింద 15 మంది విధులు నిర్వహిస్తున్నారన్నారు. వారికి రెండు నెలల పెండింగ్ వేతనాలను కేఎస్‌ఆర్ యాజమాన్యాన్ని అడగగా.. తాము జూలై నుంచి ఎన్సీసీ యాజమాన్యానికి అప్పజెప్పామని చెప్పారు. ఎన్సీసీ యాజమాన్యాన్ని వివరణ కోరగా.. కేఎస్‌ఆర్ కాంట్రాక్ట్ యాజమాన్యం అఫీషియల్‌గా మాకు అప్పగించలేరని చెప్పారు. ఇలా ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కార్మికులకు రెండునెలల వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారన్నారు. కార్మిక చట్టాల ప్రకారం వేతనాలు చెల్లించని యాజామాన్యాల కాంట్రాక్ట్‌ను మిషన్ భగీరథలో పూర్తిగా రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్మిక చట్టాల ప్రకారం వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు ఉన్నారు.

షాదీఖాన నిర్మాణానికి స్థల పరిశీలన

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రంలో షాదీఖాన నిర్మాణానికి మైనార్టీ వెల్ఫేర్ అధికారి ప్రవీణ్‌రెడ్డి మంగళవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. షాదీఖాన నిర్మాణానికి మైనార్టీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. త్వరలోనే పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వంశీకృష్ణ, వేణుగోపాల్ పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆధునికతను అందిపుచ్చుకోవాలి

మొయినాబాద్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలంటే ఆధునికతను అందిపుచ్చుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ ఎంబీఏ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ వై.జహంగీర్ అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలో ఉన్న అరిస్టాటిల్ పీజీ కళాశాలలో మంగళవారం నూతన విద్యార్థులకు స్వాగతం పలుకుతూ ఓరియంటేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యం పెంచుకుంటే ఉన్నత భవిష్యత్‌ను నిర్మించుకోవచ్చన్నారు. మారుతున్న కాలానికి, వేగానికి అనుగుణంగా నూతన విధానాలను అలవర్చుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో మెలిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లోకసాని శ్రీనివాస్ రెడ్డి, కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అధ్యాపకులు మల్లారెడ్డి, రమేశ్, రాజేందర్‌రెడ్డి, నందకిషోర్, శ్వేత, జ్యోతిక, సోని, రాజేశ్, త్రివేణి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఓరియంటేషన్ డే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రొఫెసర్ జహంగీర్

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్: డీజే నిర్వాహకులు న్యాయస్థానం ఉత్తర్వుల ప్రకారం తప్పనిసరిగా లైసెన్స్ తీసుకోవాలని ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో డీజే నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎలాంటి కార్యక్రమాలు, ఈవెంట్లలో డీజే పెట్టాలనుకుంటే ముందే అనుమతి తీసుకోవాలన్నారు. అనుమతి లేకుండా డీజేలు పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఎస్సై ముజఫర్‌అలీ, ఏఎస్సై శివారెడ్డి, డీజే నిర్వాహకులు పాల్గొన్నారు.

లైసెన్స్ తీసుకోవాలి

శంకర్‌పల్లి: సౌండ్ సిస్టం(డీజే) వాడాలంటే లైసెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంగళవారం పోలీస్ స్టేషన్‌లో పట్టణం, మండలంలోని సౌండ్ సిస్టం(డీజే) యజమానులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా డీజేలు వాడాలంటే రాజేంద్రనగర్ డీసీపీ కార్యాలయం నుంచి తప్పనిసరిగా అనుమతి పొందాలని, లేకపోతే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై సుందరయ్య, సౌండ్ సిస్టం యజమానులు తదితరులు పాల్గొన్నారు.



మొయినాబాద్: డీజే నిర్వాహకులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి

వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరోరోజు మంగళవారం అమ్మవారు మహాలక్ష్మిదేవీ అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పలు మండపాల వద్ద నిర్వాహకులు కుంకుమార్చన, హోమం, అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



షాద్‌నగర్: పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు



కేశంపేట: మండల కేంద్రంలో..



షాబాద్: మల్లారెడ్డిగూడలో..



చేవెళ్ల: పలుగుట్టలో..



మొయినాబాద్‌రూరల్: దుర్గామాత పూజలో పాల్గొన్న భక్తులు



కొందుర్గు: తుమ్మలపల్లిలో..



మొయినాబాద్‌రూరల్: అమ్డాపూర్‌లో..

ప్రజా సంక్షేమమే ధ్యేయం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి



షాద్‌నగర్: చటాన్‌పల్లిలో సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న విష్ణువర్ధన్‌రెడ్డి

షాద్‌నగర్: కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందని, కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై నాయకులు, కార్యకర్తలు విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని చటాన్‌పల్లి గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వచ్చిన పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి పదినెలలు కావొస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలుచేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రధాని మోదీ నిరుపేదల సంక్షేమం కోసం ఎన్నో అభివృద్ధి, సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తున్నారన్నారు. కేంద్ర పథకాలను అర్హులైన వారికి అందించాల్సిన బాధ్యత పార్టీ నాయకులపై ఉందన్నారు.

విఠ్యాల గ్రామంలో..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కక్కునూరి వెంకటేశ్‌గుప్తా ప్రారంభించారు. కార్యక్రమాల్లో నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్, మహేందర్‌రెడ్డి, రవికాంత్‌రెడ్డి, కిష్టయ్య, రాములు, లింగం, దశరథ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

షాబాద్: రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీధర్‌రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా కార్యదర్శి, బీజేవైఎం రాష్ట్ర స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని నాగర్‌గూడ, సంకెపల్లిగూడ గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం పార్టీ సీనియర్ నాయకులు రవీందర్‌రెడ్డితో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, ఎన్నికల హామీల విఫలంపై ప్రజలకు వివరించాలన్నారు. కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి సభ్యత్వ నమోదును జయప్రదం చేయాలన్నారు. ప్రతీ బూత్‌స్థాయిలో 200, మండలస్థాయిలో 10 వేలకు తగ్గకుండా సభ్యత్వాలు నమోదు చేయించాలన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై నేడు యువకులు, మహిళలు పెద్దఎత్తున తమ పార్టీలో సభ్యత్వం పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు రవిగౌడ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేశ్, దళిత మోర్చా మండల అధ్యక్షుడు మహేందర్, మండల ఉపాధ్యక్షుడు సురేశ్‌గౌడ్, అనంతం, రాజు తదితరులున్నారు.